సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 15 । జూన్ । 2025



'నీట్'లో మెరిసి.. ర్యాంకుతో మురిసి..

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాల్లో కడప విద్యార్థులు మెరిశారు. -IIలో



ప్రాణదానం చేద్దాం... బాధ్యతగా మెలుగుదాం

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, బాధ్యతగా మెలగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. -IIలో

గరిష్ఠం/కనిష్ఠం 36.1/25.1

వాతావరణం

జిల్లాలో శనివారం 25.1 – 36.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

అధికారమే దన్ను.. ప్రభుత్వ భూమిపై కన్ను



చిన్నమాచుపల్లిలో యంత్రాలతో చదును చేసిన భూమి



- రూ.3 కోట్ల విలువైన స్థలం ఆక్రమణ
- రాత్రికి రాత్రే టీడీపీ నేత కబ్జా

వల్లూరు (చెన్నూరు): అధికారమే అండగా టీడీపీ నేతలు చెలరేగిపోతున్నారు. వారి భూదాహానికి అడ్డూ, అదుపు లేకుండా పోయింది. చెన్నూరు మండలంలో ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే.. అక్కడ వాలిపోతున్నారు. చిన్నమాచుపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 405లో 70 సెంట్ల విస్తీర్ణం గల ప్రభుత్వ భూమి ఉంది. ఇది సెంటు సుమారు రూ.5 లక్షల వరకు విలువ చేస్తుంది. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత కన్ను ఆ భూమిపై పడింది. ఇంకేముంది అదును కోసం ఎదురు చూశాడు. రెండవ శనివారం, ఆ తర్వాత ఆదివారం సెలవు కావడంతో .. శుక్రవారం రాత్రికి రాత్రే, 70 సెంట్ల స్థలంలో ఎక్సకవేటర్(జేసీబీ) యంత్రాలతో చదును చేయించాడు. ఇక్కడ అక్రమ నిర్మాణాలకు ఏర్పాటు జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ సరస్వతిని వివరణ కోరగా.. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన విషయం తన దృష్టికి రాలేదని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని, అలాగే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



తొలగించిన కంప

క్లుప్తంగా

జులై 14 నుంచి బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు జులై 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీఈడీ 2వ సెమిస్టర్, 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులకు, అలాగే ఎంఈడీ రెండు, నాలుగు సెమిస్టర్ల సప్లిమెంటరీ, రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి జరగాల్సిన బీఈడీ, ఎంఈడీ పరీక్షలను డీఎస్సీ (ఉపాధ్యాయ ఉద్యోగ నియామకపు పరీక్ష) రాసే విద్యార్థుల అభ్యర్థన దృష్ట్యా, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జులై 14వ తేదీకి వాయిదా వేశామన్నారు. రీషెడ్యూల్ అయిన తేదీల టైం టేబుల్ విద్యార్థులు చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సూచించారు.

ఏపీ ట్రాన్స్‌కో కడప జోనల్ సీఈగా క్రిష్ణకుమార్



క్రిష్ణ కుమార్‌ను సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు

కడప కార్పొరేషన్ : ఏపీ ట్రాన్స్‌కో కడప జోనల్ చీఫ్ ఇంజనీర్‌గా డీవీ క్రిష్ణ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఈగా పని చేస్తున్న శ్రీనివాసులును విజయవాడ విద్యుత్ సౌధకు బదిలీ చేశారు. క్రిష్ణ కుమార్ కడపలోనే కన్‌స్ట్రక్షన్ ఎస్ఈగా విధులు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం ఆయనకు పదోన్నతి కల్పించి సీఈగా నియమించారు. క్రిష్ణ కుమార్‌కు విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీకే వీరభద్రయ్య పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ అందరూ కష్టపడి పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేసి, కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు శ్రీరామచంద్రమూర్తి, బాషా, ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు శ్రీనాథుడు, రామ్మోహన్, వెంకటసుబ్బయ్య, రమణ, నారాయణస్వామి, చంద్రశేఖర్, భాస్కర్‌నాయుడు, సతీష్, రామిరెడ్డి, నరసింహ, ప్రసాద్ రెడ్డి, విష్ణు కుమార్ పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసి.. ర్యాంకుతో మురిసి..

- వైద్య విద్య ప్రవేశ పరీక్షలో కడప విద్యార్థుల సత్తా
- హన్నికరెడ్డికి జాతీయ స్థాయిలో 343వ ర్యాంకు

దేశంలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్– యూజీ 2025 పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో కడప విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించి భళా అనిపించారు. వారితోపాటు తల్లిదండ్రులు, గురువులు ఆనందం వ్యక్తం చేశారు. వారికి బంధువులు, స్థానికులు అభినందనలు తెలిపారు. – కడప ఎడ్యుకేషన్

• ఇష్టపడి చదివా



తల్లితండ్రులతో హన్నికరెడ్డి



చిన్నప్పటి నుంచి ఇష్టంగా ఎంతో కష్టపడి చదివానని నీట్‌లో 343వ ర్యాంకు సాధించిన మల్లపు హన్నికరెడ్డి తెలిపారు. కడపకు చెందిన మల్లపు జయరామక్రిష్ణారెడ్డి(ఆడిటర్), అనురాధ(గృహిణి)ల కుమార్తె. ఆమె 1 నుంచి 10వ తరగతి వరకు కడప నాగార్జున మోడల్ స్కూల్‌లో చదివి 10వ తరగతిలో 584 మార్కులు సాధించింది. ఇంటర్మీడియెట్‌ను విజయవాడ నారాయణ కళాశాలలో(సెంట్రల్ సిలబస్) చదివి 500కు 484 మార్కులు తెచ్చుకుంది. ప్రస్తుతం విడుదలైన జాతీయస్థాయి నీట్ ఫలితాల్లో 343వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా హన్నికారెడ్డి మాట్లాడుతూ బాగా చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి చిన్నపిల్లల వైద్యురాలినై వైద్య సేవలందించడమే తన లక్ష్యమని తెలిపారు. కడపలోని వంశీ ట్యూషన్ అధినేత వంశీ సర్ సూచనలు, సలహాలతోనే నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించానని పేర్కొన్నారు.

• తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..



తల్లిదండ్రులతో అక్షయ్‌కీర్తన్



తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను జాతీయస్థాయి నీట్‌లో 379వ ర్యాంకు సాధించానని దూదిమణి అక్షయ్‌కీర్తన్ తెలిపారు. కడప ద్వారకానగర్‌కు చెందిన డాక్టర్ రెడ్డిప్రసాద్(రిమ్స్ వైద్యులు), మల్లిక(గైనాకాలజిస్టు)ల కుమారుడు అక్షయకీర్తన్ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కడపలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాడు. పదో తరగతిలో 600కు 590 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. ఇంటర్మీడియెట్‌ను విజయవాడ నారాయణ కళాశాలలో చదివి సెంట్రల్ సిలబస్‌లో 500లకు 497 మార్కులు సాధించాడు. ప్రస్తుతం విడుదలైన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 379వ ర్యాంకు సాధించాడు. ఇంకా బాగా చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి తరువాత కార్డియాలజీ డాక్టర్ కావడమే జీవితాశయం అని అక్షయ్‌కీర్తన్ తెలిపారు.

• గుండె డాక్టర్ కావడమే లక్ష్యం



తల్లిదండ్రులతో క్రిష్ణప్రశాంత్



ఇంకా బాగా చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి గుండె వైద్య నిపుణులుగా సేవలు అందించడమే తన లక్ష్యమని జాతీయస్థాయి నీట్‌లో 900 ర్యాంకు సాధించిన యారాసి క్రిష్ణప్రశాంత్ తెలిపారు. కడప నగరానికి చెందిన సురేంద్రనాథ్(ప్రొఫెసర్ ఇన్ ఫార్మసీ), జాన్సీ లక్ష్మిరెడ్డి(ప్రముఖ దంత వైద్యులు)ల కుమారుడు యారాసి క్రిష్ణ ప్రశాంత్ 1 నుంచి 7వ తరగతి వరకు రాజమండ్రి, కాకినాడలో చదివాడు. ఆ తరువాత 7 నుంచి 10వ తరగతి వరకు కడపలోని హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లో చదివి పదో తరగతిలో 577 మార్కులు సాధించాడు. ఇంటర్మీడియెట్‌ను విజయవాడ నారాయణ జూనియర్ కళాశాలలో చదివి 461 మార్కులు కైవసం చేసుకున్నాడు. ప్రస్తుతం విడుదలైన నీట్‌లో 900 ర్యాంకు సాధించాడు. తన తల్లిదండ్రులు, గురువుల సూచనలు, సలహాలతోనే ఈ ర్యాంకు సాధించానని క్రిష్ణప్రశాంత్ తెలిపారు.

జేఈఈ ఫలితాల్లో మెరిసిన దొండపాటి



కడప ఎడ్యుకేషన్ : జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో కడపకు చెందిన దొండపాటి లలిత్ ప్రసాద్‌రెడ్డి షార్ట్ టర్మ్‌లోనే 2411 ర్యాంకు సాధించి ప్రముఖ కాన్పూర్ ఐఐటీలో ఎలక్ట్రానిక్ సీటు సాధించాడు. కడప నగరానికి దొండపాటి సుబోధరెడ్డి(కాంట్రాక్టరు) తల్లి గీతాంజలి (గృహిణి) కుమారుడు లలిత్ ప్రసాద్‌రెడ్డి కడపలోని మోంటిపోర్ట్ స్కూల్లో ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు చదివాడు. ఆ తరువాత 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నారాయణ స్కూల్ చదివాడు. ఇంటర్మీడియట్‌ను బెంగళూరులోని నారాయణ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. అక్కడ కళాశాల వారు ఇచ్చిన షార్ట్ టర్మ్ కోచింగ్‌తోనే 2411వ ర్యాంకును సాధించాడు. దొండపాటి లలిత్ ప్రసాద్‌రెడ్డి సోదరుడు భవాని శంకర్ కూడా మద్రాసు ఐఐటీలో ఏరోస్పేస్ లో సీటు సాధించి చివరి సంవత్సరం చదువుతున్నాడు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ : నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మదనపల్లెకు చెందిన కె. జయంత్‌రెడ్డి ప్రతిభ కనబరిచాడు. శనివారం విడుదల చేసిన ఫలితాల్లో మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి ,శ్రావణిల కుమారుడు జయంత్‌రెడ్డి 4571 ఆలిండియా ర్యాంకు సాధించాడు. ఏపీ ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 48 ర్యాంకు దక్కించుకున్నాడు. ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య కాలేజీలో చదివాడు. ఇంటర్మీడియట్‌లో 978 మార్కులు సాధించాడు. జయంత్‌రెడ్డిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

చిత్తూరు, అనంతపురం జట్లు విజయ ఢంకా



సోహన్‌రెడ్డి, చిత్తూరు (110 పరుగులు)



భార్గవ్ మహేష్, నెల్లూరు (5 వికెట్లు)



రిహాన్, అనంతపురం (117 పరుగులు)



టివి సాయి ప్రతాప్‌రెడ్డి, అనంతపురం (5 వికెట్లు)



నిషిచ్, అనంతపురం (5 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ -19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు విజయ ఢంకా మోగించాయి. శనివారం వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో నెల్లూరు జట్టుపై 110 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది, టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 46.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 237పరుగులు చేసింది. ఆ జట్టులోని సోహన్‌రెడ్డి 119 బంతులకు 110 పరుగులు చేశాడు . నెల్లూరు జట్టులో భార్గవ్ మహేష్ 5, తోషిత్ యాదవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 238 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 31.5 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేశారు. ఆ జట్టులోని సాహిల్ హామీద్ 60 పరుగులు చేశాడు . చిత్తూరు జట్టులోని ధనుష్‌రెడ్డి 4 వికెట్లు తీశాడు.

110 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం:

కెఎస్ఆర్ఎమ్ క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 110 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు 50 ఓవర్లలకు 283 పరుగుల చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రిహాన్ 16 ఫోర్లు, 2 సిక్సర్లతో117 పరుగులు చేశాడు. అనంతరం 284 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 31.3 ఓవర్లలో 173 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని కెవి ఓంకార్ 57 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని నిషిచ్ 5, టివి సాయి ప్రతాప్ రెడ్డి 5 వికెట్లు తీసుకున్నారు.

రక్తదానం చేద్దాం... ప్రాణాలు నిలుపుదాం

జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు

కడప కల్చరల్ : ప్రస్తుత సమాజంలో బాధితులకు రక్తం అవసరం ఎంతైనా ఉందని, మిగతా వారికి కూడా అవసరమున్నసమయంలో స్పందించాలని జిల్లా రెవెన్యూ అధికారి, రెడ్ క్రాస్ సొసైటీ స్పెషలాఫీసర్ విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏపీ సాక్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా జిల్లాలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కడప నగరంలోని మట్టి పెద్దపులి సర్కిల్ వద్ద ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ .నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేయడంతో పాటు మన చుట్టూ ఉన్నవారితో కూడా రక్తదానం చేయించాలన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్న 18 నుంచి 60 సంవత్సరాలలోపు గలవార, 45 కేజీల పైన బరువు వున్న వారు రక్తదానం చేయవచ్చన్నారు. అంతేకాకుండా రక్తదానం చేయడం వల్ల ఎన్నో ఆరోగ్యకర ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ ఏ.సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో ఫ్యాక్టరీలు, కళాశాలలు ఉన్నాయని, ఆయా యాజమాన్యాల వారు వారి సిబ్బంది, విద్యార్థులకు రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి సహకరించాలని కోరారు. అనంతరం జీవిత కాలంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన రక్తదాతలకు, 2024– 25 ఆర్థిక సంవత్సరంలో రెడ్ క్రాస్ సొసైటీకి సహకరించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసిన కళాశాలలకు, ప్రైవేట్ సంస్థలు, ఎన్జీవో సంస్థలకు మెమెంటోలు, ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం రక్తదాతలను శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్ రవిబాబు, ఏపీ సాక్స్ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి భాస్కర్, రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ యశస్విని రెడ్డి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుధాకర్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకాష్‌నగర్‌లో నివాసం వుంటున్న భవనాసి శ్రీనివాసులు (ఎల్‌ఐసీ, ఏఏఓ), ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అతని భార్య మేరీ స్టెల్లా శుక్రవారం రాత్రి తమ ఇంటికి లోపలివైపు నుంచి తాళాలు వేసుకుని బెడ్‌రూంలో నిద్రిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వెనుకవైపున కటాంజనం (ఇనుపవాకిలి)కి వేసిన తాళం పగులగొట్టాడు. ఎంచక్కా ఇంటిలోకి ప్రవేశించి బీరువాను తెరిచి అందులోని బంగారు ఆభరణాలను దాదాపు ఏడు తులాలు, రూ.లక్షకు పైగా నగదును దోచుకుపోయాడు. ప్రకాష్‌నగర్‌లోనే సంచరించిన సదరు దొంగ మూడు ఇళ్లలో కాలింగ్‌బెల్ నొక్కి దొంగతనాలకు ప్రయత్నించాడు. వీరి ఇంటిలో దొంగతనం చేశాడు. సీసీపుటేజీల ఆధారంగా దొంగకోసం గాలింపు చర్యలను చేపట్టారు. సంఘటన స్థలాన్ని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌక్ ఎస్ఐ ఎస్. రాజరాజేశ్వర్‌రెడ్డి, క్లూస్ టీంతోపాటు సిబ్బంది పరిశీలించారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లి సర్కిల్ సమీపంలో ఇందిరానగర్‌కు చెందిన చాంద్‌బాషా అనే వ్యక్తిని మనస్పర్థలతో రెడ్డెయ్య, అభి అనే ఇద్దరు శనివారం దాడి చేశారు. గాయపడిన చాంద్‌బాషా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి. రామకృష్ణ తెలియజేశారు.

కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్య

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలిలా.. పట్టణంలోని రామగోపాల్‌నాయుడు వీధికి చెందిన ఆదినారాయణ కుమారుడు లోకేష్(31)కదిరిరోడ్డులోని ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అతడు అవివాహితుడు. గత కొంత కాలంగా కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ మనస్థాపానికి గురయ్యాడు. మూడు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. టు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు యువకులను బలిగొన్న రోడ్డు ప్రమాదం కేసు ఛేదింపు

పెద్దతిప్పసముద్రం : ఈ ఏడాది మార్చి 17న అర్ధరాత్రి పీటీఎం–బి.కొత్తకోట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సాదిలి చందూ కుమార్ (20), దండు శీనూ (21) బి.కొత్తకోటలో సెకండ్ షో సినిమా చూసి తిరిగి పీటీఎంకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా యువకులిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చందూకుమార్ తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లారీకి చెందిన వస్తువు ఆధారంగా ఎస్ఐ ఈ కేసును సవాల్‌గా తీసుకుని ఎట్టకేలకు ఛేదించారు. ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... ప్రమాద స్థలంలో టీపీ అని ఆంగ్ల అక్షరాలు కలిగి ఉన్న పార్కింగ్ స్టాండ్ పీస్ ఆధారంగా కేసును ఛేదించామన్నారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన సిమెంటు ట్యాంకర్ లారీ ద్విచక్ర వాహనదారులను బలంగా గుద్ది ముందుకు వెళుతుండగా ఈ దృశ్యాన్ని చూసిన పలువురు కేకలు వేస్తున్నప్పటికీ లారీ డ్రైవర్ దవరిక యాదవ్ (30) వాహనం నిలిపినట్టే నిలిపి ఒక్కసారిగా వేగంగా ముందుకు వెళ్ళిపోయినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అనంతరం ప్రమాద స్థలంలోని ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలతో పలు చోట్ల ప్రధాన రహదారుల్లోని సీసీ కెమెరాలను క్షుణంగా పరిశీలించి పోలీస్ సాంకేతిక నిపుణుల చొరవ, స్థానిక పోలీసు సిబ్బంది సహకారంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించామని ఎస్ఐ తెలిపారు. అనంతరం వాహన యజమానిని సంప్రదించగా లారీ సహా ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్ శనివారం స్టేషన్‌లో లొంగిపోగా నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

నాడు కౌన్సిలర్.. నేడు కౌన్సిలర్ అభ్యర్థి



పోలీసులకు పట్టుబడిన మట్కా నిర్వాహకులు



మున్సిపల్ ఎన్నికల్లో 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన బండారు శ్రీనాథ్

మట్కా కేసుల్లో టీడీపీ నాయకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీడీపీ నేతలు ఒక్కొక్కరుగా పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్నారు. సమాజాన్ని ఉద్ధరించేందుకు ప్రజల పక్షాన పోరాటాలు చేసే క్రమంలో నమోదైన కేసుల్లో అయితే కాదు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట లాంటి జూదాలు పేద, మధ్య తరగతి కుటుంబాల రక్తాన్ని పీలుస్తూ వాళ్ల కుటుంబాలు వీధిన పడటానికి కారణం అవుతున్నాయి. కూలీ నాలీ చేసుకునే పేదలు వీటి బారిన పడుతున్నారు. వీరి బలహీనతను ఆసరాగా చేసుకొని కొందరు టీడీపీ నేతలు అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం జిన్నా రోడ్డులో మట్కా నిర్వహిస్తున్న టీడీపీ కౌన్సిలర్‌ను టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే మరో టీడీపీ నాయకుడు మట్కా నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరఫున 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన బండారు శ్రీనాథ్‌ను మట్కా కేసులో శుక్రవారం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతనితో పాటు మరో ఏడుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి కొంత మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్ని రోజుల క్రితం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీకి చెందిన పలువురు నాయకులపై క్రికెట్ బెట్టింగ్ నమోదు అయిన విషయం తెలిసిందే. మట్కా, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న టీడీపీ నేతలపై వరుసగా కేసులు నమోదు అవుతుండటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడానికి కృషి చేయాల్సిన ఆ పార్టీ నేతలే వీటిని ప్రోత్సహించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి.

తల్లి, కుమార్తె ఆత్మహత్యాయత్నం

తల్లి పరిస్థితి విషమం



ఆత్మహత్యయత్నానికి పాల్పడిన జానకమ్మ

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో తల్లి, కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తల్లి పరిస్థితి విషమంగా మారిన సంఘటన శనివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. మండలంలోని వెలిగల్లు పంచాయతీ పడమటివారిపల్లెకు చెందిన నాగిరెడ్డి భార్య జానకమ్మ(30), కుమార్తె వర్షారెడ్డి(10) కుమారుడు ఉన్నారు. అయితే గత కొంత కాలంగా నాగిరెడ్డి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేయడంతో జానకమ్మ తీవ్రంగా మనస్థాపం చెందింది. శనివారం తాను విషం తాగి పిల్లలకు విషం ఇవ్వాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా పురుగు మందు జ్యూస్‌లో కలుపుకుని ఆమె సగం తాగి, కుమార్తె వర్షారెడ్డికి ఇచ్చింది. కుమార్తె కొద్దిగా తాగి చేదుగా ఉందని చెప్పింది. అయితే జానకమ్మ కుమారుడిని పిలవమని చెప్పడంతో వర్షారెడ్డి వెళ్లింది. ఎక్కువ మోతాదులో జానకమ్మ తాగడంతో జానమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు జానకమ్మతో పాటు వర్షారెడ్డిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం జానకమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పెద్దమండ్యం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



సూపర్ 'సఫారీ'

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా

దక్షిణాఫ్రికా సుదీర్ఘ స్వప్నం నెరవేరింది...ఐసీసీ ట్రోఫీ కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా పోరాడిన టీమ్ ఎట్టకేలకు ఆ లక్ష్యాన్ని చేరుకుంది...1998లో ఐసీసీ నాకౌట్ కప్ సాధించిన తర్వాత 7 వన్డే వరల్డ్ కప్‌లు, 9 టి20 వరల్డ్ కప్‌లు, 9 చాంపియన్స్ ట్రోఫీలు, 2 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లు జరగ్గా... ఒక్క సారి కూడా టైటిల్ అందుకునే అవకాశమే రాలేదు... అద్భుతంగా ఆడుతూ వచ్చి అసలు సమయంలో చేతులెత్తేసిన సందర్భాలు కొన్నయితే, అవసరమైన చోట అదృష్టం మొహం చాటేసిన సందర్భాలు మరికొన్ని... ఇప్పుడు ఆ 'చోకర్స్' ముద్రను వెనక్కి తోస్తూ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో సఫారీ టీమ్ సంబరాలు చేసుకుంది. ఆసక్తికరంగా సాగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసి బవుమా సేన సగర్వంగా సత్తా చాటింది. ఐసీసీ టోర్నీ ఫైనల్ అంటే చెలరేగిపోయే ఆసీస్ ఈ సారి మాత్రం బ్యాటింగ్ వైఫల్యంతో తలవంచి నిరాశగా వెనుదిరిగింది.

- 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సొంతం
- ఫైనల్లో 5 వికెట్లతో ఆస్ట్రేలియాపై ఘన విజయం

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో దక్షిణాఫ్రికా చాంపియన్‌గా నిలిచింది. శనివారం ముగిసిన ఫైనల్లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 213/2తో నాలుగో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 83.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎయిడెన్ మార్క్‌రమ్ (207 బంతుల్లో 136; 14 ఫోర్లు) దాదాపు చివరి వరకు నిలబడి జట్టును గెలిపించాడు. న్యూజిలాండ్ (2021), ఆస్ట్రేలియా (2023) తర్వాత డబ్ల్యూటీసీ గెలుచుకున్న మూడో టీమ్‌గా దక్షిణాఫ్రికా నిలిచింది. విజేత దక్షిణాఫ్రికాకు రూ. 30.76 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది.

27.4 ఓవర్లలో 69 పరుగులు...

ఆట ఆరంభంలోనే తెంబా బవుమా (134 బంతుల్లో 66; 5 ఫోర్లు)ను కమిన్స్ అవుట్ చేయగా, కొద్ది సేపటికే స్టబ్స్ (8)ను స్టార్క్ బౌల్డ్ చేశాడు. ఆ సమయంలో దక్షిణాఫ్రికా మరో 41 పరుగులు చేయాల్సి ఉండటంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే మరో వైపు మార్క్‌రమ్ మూడో రోజు తరహాలోనే పట్టుదలగా ఆడుతూ జట్టును గెలుపు దిశగా నడిపించాడు. అతనికి బెడింగ్‌హామ్ (21 నాటౌట్) అండగా నిలిచాడు. ఎట్టకేలకు కొత్త బంతిని తీసుకున్న వెంటనే తొలి ఓవర్లోనే మార్క్‌రమ్‌ను హాజల్‌వుడ్ వెనక్కి పంపించినా...అప్పటికే ఆలస్యమైపోయింది. విజయానికి మరో 5 పరుగులు మాత్రమే కావాల్సి ఉండగా, స్టార్క్ వేసిన బంతిని వెరీన్ కవర్ పాయింట్ దిశగా ఆడి సింగిల్ తీయడంతో సఫారీ శిబిరంలో వేడుక మొదలైంది.

స్కోరు వివరాలు: **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 138; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 207; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) హెడ్ (బి) హాజల్‌వుడ్ 136; రికెల్టన్ (సి) క్యారీ (బి) స్టార్క్ 6; ముల్డర్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 27; బవుమా (సి) క్యారీ (బి) కమిన్స్ 66; స్టబ్స్ (బి) స్టార్క్ 8; బెడింగ్‌హామ్ (నాటౌట్) 21; వెరీన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (83.4 ఓవర్లలో 5 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1–9, 2–70, 3–217, 4–241, 5–276. **బౌలింగ్:** స్టార్క్ 14.4–1–66–3, హాజల్‌వుడ్ 19–2–58–1, కమిన్స్ 17–0–59–1, లయన్ 26–4–66–0, వెబ్‌స్టర్ 5–0–13–0, హెడ్ 2–0–8–0.


కుమారుడితో బవుమా సంబరం

చోకర్స్ కాదు... విన్నర్స్

దాదాపు ఏడాది క్రితం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో టి20 వరల్డ్ కప్ ఫైనల్లో తలపడింది. 177 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో చేతిలో 6 వికెట్లతో 30 బంతుల్లో 30 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. ఇక విజయం లాంఛనమే అనిపించగా...చివరకు 7 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. డగౌట్‌లో కూర్చుకున్న కెప్టెన్ మార్క్‌రమ్ కన్నీళ్లపర్యంతమైన దృశ్యం దక్షిణాఫ్రికా అభిమానులకు కలచివేసింది. ఇప్పుడు సంవత్సరం తిరగక ముందే అతను సఫారీ ఫ్యాన్స్ దృష్టిలో హీరోగా మారిపోయాడు. ఆస్ట్రేలియా 'బౌలింగ్ చతుష్టయం'ను ఎదుర్కొని దక్షిణాఫ్రికా 282 పరుగులు సాధించగలదా అనే సందేహాల మధ్య అతను అసాధారణ బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 'డకౌట్' అయినా రెండో ఇన్నింగ్స్‌లో ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పట్టుదలగా తన కెరీర్‌లో అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. కెప్టెన్ తెంబా బవుమా విజయగాథ కూడా ఇలాంటిదే. 64 టెస్టుల కెరీర్‌లో కేవలం 4 సెంచరీలే సాధించిన అతను ప్రతీసారి తీవ్ర విమర్శలే ఎదుర్కొన్నాడు. 'బ్లాక్ ఆఫ్రికన్' కాబట్టి టీమ్‌లో చోటు దక్కిందని, రిజర్వేషన్ కారణంగానే కొనసాగుతున్నాడని వ్యాఖ్యలు వినిపిస్తూ వచ్చాయి. తాజా ఘనతతో బవుమా నాయకుడిగా ఆకాశమంత ఎత్తున నిలిచాడు. ఫైనల్‌కు ముందు తన కెప్టెన్సీలో ఆడిన 9 టెస్టుల్లో 8 మ్యాచ్‌లు గెలిపించి ఓటమి ఎరుగని అతను...ఇప్పుడు టీమ్‌ను వరల్డ్ చాంపియన్‌గా నిలిచి పొట్టివాడు అయినా గట్టివాడే అని నిరూపించాడు. మార్క్‌రమ్, బవుమా 147 పరుగుల భాగస్వామ్యం ఆస్ట్రేలియా ఆట కట్టించేలా చేసింది. డ్రగ్స్ వివాదం నుంచి బయటపడిన రబాడ 9 వికెట్లతో సఫారీ విజయానికి పునాది వేయగా, రెండో ఇన్నింగ్స్‌లో ఇన్‌గిడి తన విలువ చాటాడు.

విమర్శలను అధిగమించి...

దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించినా...ఆ జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. ఎదురుగా బలమైన ఆస్ట్రేలియాలాంటి ప్రత్యర్థి ఉండటంతో పాటు టీమ్‌లో అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. టాప్–7 బ్యాటర్లతో పాటు ఆల్‌రౌండర్ యాన్సెన్ మొత్తం టెస్టు పరుగులు కలిపినా... ఒక్క స్టీవ్ స్మిత్ సాధించిన పరుగులకంటే తక్కువగా ఉన్నాయి! పైగా స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, లయన్ కలిసి ఆసీస్‌కు ఎన్నో అద్భుత విజయాలు అందించారు. అలాంటి బౌలింగ్‌ను ఎదుర్కొని గెలవడం దాదాపు అసాధ్యమని అనిపించింది. అన్నింటికి మించి సఫారీ టీమ్ ఫైనల్‌కు చేరిన క్రమంపై విమర్శలు ఉన్నాయి. 2023–25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రశ్రేణి టీమ్‌లైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను ఒక్క టెస్టులోనూ ఎదుర్కొని టీమ్... సొంతగడ్డపై భారత్ చేతిలో 55కు ఆలౌటై చిత్తుగా ఓడింది. వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లాంటి బలహీన ప్రత్యర్థులపై (వరుసగా 7 టెస్టులు) గెలిచి ఫైనల్ చేరిందని వ్యాఖ్యలు వచ్చాయి. అయితే ఫైనల్‌కు ముందు 'అదంతా మా చేతుల్లో లేదు. ఈ ఒక్క మ్యాచ్ గెలిస్తే దానిని ఎవరూ పట్టించుకోరు' అంటూ స్పష్టంగా చెప్పిన బవుమా దానిని చేసి చూపించాడు. ఆస్ట్రేలియాను ఓడిస్తేనే వరల్డ్ చాంపియన్‌గా భావిస్తాం అనేవారికి సమాధానం ఇచ్చాడు. స్వదేశంలో టి20 లీగ్ కోసం ప్రధాన ఆటగాళ్లతో కాకుండా ద్వితీయ శ్రేణి జట్టును న్యూజిలాండ్ పంపగా 0–2తో టీమ్ చిత్తయింది. అయినా సరే చివరకు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్టు అర్హత సాధించడం విశేషం.

ఆనందం దక్కింది...

అంతర్జాతీయ క్రికెట్‌లోకి 1991లో దక్షిణాఫ్రికా పునరాగమనం చేసింది. ఆ తర్వాత 1992 వరల్డ్ కప్ సెమీస్‌లో వర్షం నిబంధనతో ఓడిన జట్టు, 1996లో అన్ని లీగ్‌లు గెలిచి క్వార్టర్స్‌లో అనూహ్యంగా ఓడింది. 1998తో క్రానే, కలిస్, రోడ్స్, బౌచర్‌లతో కూడిన జట్టు తొలి చాంపియన్స్ ట్రోఫీని గెలిచి ఆనందం పంచింది. అయితే ఆ తర్వాతే జట్టు రాత పూర్తిగా మారిపోయింది. గత ఏడాది టి20 వరల్డ్ కప్‌కు ముందు వరకు ఒక్క ఐసీసీ టోర్నీలోనూ ఫైనల్ చేరలేకపోయింది. 1999 సెమీస్‌లో 'టై'తో గుండె పగలగా, సొంతగడ్డపై 2003లో మళ్లీ వర్షంతో లెక్క తప్పడంతో సెమీస్ కూడా చేరలేకపోయింది. ఆ తర్వాత మూడు సార్లు సెమీస్ వరకు చేరడంలో సఫలమైంది. స్వదేశంలో 2007 టి20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరని జట్టు తర్వాత రెండు సార్లు సెమీస్‌లోనే ఓడింది. చాంపియన్స్ ట్రోఫీలో ఐదు సార్లు సెమీస్‌కే పరిమితమైంది. వేర్వేరు కారణాలతో వచ్చిన ఈ ఓటములతో టీమ్‌లో నైరాశ్యం నెలకొంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా బోర్డులో రాజకీయాలు, ఆర్థిక సంక్షోభం తదితర కారణాలతో జట్టు ఆటపై కూడా ప్రభావం పడింది. వరుస ఓటములతో టీమ్ వెనుకబడిపోవడంతో ఇతర టీమ్‌ల దృష్టిలో అది ద్వితీయ శ్రేణి జట్టుగా మారిపోయింది. అయితే తాజా విజయం సఫారీ టీమ్‌లో కొత్త ఉత్సాహం తీసుకురానుంది. 2027 వన్డే వరల్డ్ కప్ కూడా అక్కడే జరగనున్న నేపథ్యంలో ఈ విజయం వారిలో జోష్ నింపడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

బర్త్ డే స్పెషల్


● 'లెనిన్'లో శ్రీలీల

దక్షిణాదిలోని యంగ్ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళుతున్నారు శ్రీలీల. తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ చిత్రాలతో బిజీ బిజీగా ఉన్న ఈ బ్యూటీ పుట్టిన రోజు జూన్ 14న. ఈ సందర్భంగా తెలుగులో ఆమె నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్, మాస్ జాతర, లెనిన్' సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్ రిలీజ్ చేసి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. అలాగే 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ–హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే... అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పై మూడు సినిమాల నుంచి శ్రీలీల బర్త్ డే స్పెషల్ పోస్టర్స్ విడుదల అయ్యాయి.

అందుకే లా చదువుతున్నాను

- హీరోయిన్ అనంతిక



''ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో స్క్రీన్‌పై సంప్రదాయంగానే ఎక్కువగా కనిపించాను.అలాగని గ్లామర్ పాత్రలు చేయనని కాదు. నేనొక ఆర్టిస్టుని. కథ డిమాండ్ చేస్తే ఇంటిమేట్ సీన్స్‌లో నటించడానికి నాకు అభ్యంతరం లేదు. కానీ ఆ సీన్స్ నా పాత్రకు, సినిమాలకు ఉపయోగపడేలా ఉండాలి'' అని హీరోయిన్ అనంతికా సనీల్ కుమార్ అన్నారు. అనంతికా సనీల్ కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అనంతిక మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో శుద్ధి యోగ్య అనే పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్ర దృష్టి కోణం నుంచి ఈ కథ సాగుతుంది. ఓ అమ్మాయి జీవితంలో 17 ఏళ్ల వయసు నుంచి 27 ఏళ్ల వరకు జరిగిన కొన్ని సంఘటనలను '8 వసంతాలు' సినిమాగా చూపిస్తున్నాం. ఫణీంద్రగారు చెప్పిన ఈ సినిమా కథ విన్నప్పుడు నాకు, మా అమ్మకు కన్నీళ్లొచ్చాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలతో అసోసియేట్ కావడం ఆనందంగా ఉంది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే యాక్టింగ్ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలనుకుంటున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. చెప్పాలంటే నేను అనుకోకుండానే నటి అయ్యాను. లాక్‌డౌన్ సమయంలో పెద్దగా పని దొరకలేదు. ఆ సమయంలో అలాంటి ఆలోచనలు వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో కరాటే, మార్షల్ ఆర్ట్స్ కూడా నేను నేర్చుకున్నాను. ప్రస్తుతం నేను 'లా' చదువుతున్నాను. భవిష్యత్తులో రాజకీయ నాయకురాలిని అవ్వాలనుకుంటున్నాను. అందుకే 'లా' చదువుతున్నాను'' అని చెప్పారు.

మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ ఫ్రీడమ్

- హీరో తేజ సజ్జా

'చూడాలని ఉంది, కలిసుందాం రా, గంగోత్రి, ఛత్రపతి' తదితర చిత్రాలతో బాల నటుడిగా ప్రేక్షకులకు దగ్గరై, 'ఓ బేబీ'తో లీడ్ యాక్టర్‌గా మారి, ఆ తర్వాత చేసిన 'జాంబిరెడ్డి'తో ఆకట్టుకున్నారు తేజ సజ్జా. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ 'ఫాదర్స్ డే' గురించి 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ఈ విధంగా...



● నాకు ఊహ తెలిసినప్పట్నుంచి మా నాన్నగారు వృత్తి రీత్యా బిజీగా ఉండేవారు. కానీ ఆదివారం మాత్రం నన్ను కూడా తనతో పాటు ఆఫీస్‌కు తీసుకుని వెళ్లేవారు. అక్కడ అందరూ పని చేస్తుంటే ఆసక్తిగా గమనించేవాడిని. అలా వెళ్లడం వల్లనో ఏమో నా ఆరేళ్ల వయసుకే స్కూలు, సినిమా షూటింగ్‌లు వంటి పరిసరాల్లో నేను చాలా మామూలుగా ఉండగలిగాను. ఎలాంటి బెదురు లేకుండా షూటింగ్ చేసే వాణ్ణి.

● నా అల్లరి విషయానికొస్తే... ఒకసారి స్కూల్ నుంచి మా నాన్నగారికి ఫోన్ చేసి, 'మీ అబ్బాయి బాగా అల్లరి చేస్తున్నాడు' అని కంప్లైంట్ చేశారు. నాన్న చాలా కూల్‌గా... 'వాడిని పెంచింది నేను. ఏం చేస్తాడో, ఏం చెయ్యడో నాకు బాగా తెలుసు. మీరేం చెప్పినా నమ్మను. వాడిని అడగను కూడా' అని ఫోన్ కట్ చేశారు. నాన్న అంత నమ్మారు కాబట్టి అప్పట్నుంచి ఈరోజు వరకూ నా వల్ల ఆయనకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా జాగ్రత్తగా, క్రమశిక్షణతో ఉంటున్నాను.

● నాన్నకి నేనంటే చాలా నమ్మకం. నా ఇష్టాయిష్టాలకు, నా నిర్ణయాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. చదువు, సినిమాలు... ఇలా నన్ను అన్ని విషయాల్లోనూ ప్రోత్సహించారు. యాక్చువల్లీ నాన్నకు మొదట్లో సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. ఒకటి, రెండు సినిమాలు అయ్యాక నేను షూటింగ్స్‌ను పిక్నిక్‌లా ఎంజాయ్ చేస్తున్నానని నన్ను వెళ్లనిచ్చారు. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ అయ్యాక ధైర్యం చేసి, నాన్న దగ్గరికి వెళ్లి, 'ఈ చదువు నా వల్ల కావడం లేదు. సినిమా ఇండస్ట్రీకి వెళ్తాను' అనగానే టీవీ చూస్తున్న నాన్న కనీసం తల కూడా తిప్పకుండా 'సరే నీ ఇష్టం' అన్నారు. అలా ఒక్క మాట కూడా అడగకుండా నాకు ఇష్టమైన కెరీర్‌ని ఎంచుకునేలా ప్రోత్సహించే సరికి, ఒక బాధ్యతలా భావించి, పట్టుదలతో పని చేస్తున్నాను.

● నాకు పదేళ్లు వచ్చేసరికి మా నాన్న నాతో ఒక ఫ్రెండ్‌లా బిహేవ్ చేయడం మొదలు పెట్టారు. అన్ని రకాల పనులు, విషయాల్లో నా ఒపీనియన్ అడిగి తెలుసుకునే వారు. ఏదైనా నిర్ణయం తీసుకునే విషయంలో నా అభిప్రాయానికి కూడా విలువ ఇచ్చేవారు. నేను చాలా బాధ్యతగా ఉండటానికి అది చాలా ఇన్‌స్పైర్ చేసింది.

● నా లైఫ్‌లో మా నాన్నే నా హీరో. ఒక మామూలు వ్యక్తిగా లైఫ్ స్టార్ట్ చేసి, తన వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగారు. కుటుంబంలో ఉన్న అందరి బాధ్యతలతో పాటు... బంధువుల్లో ఎంతో మందికి చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి వాటికి హెల్ప్ చేశారు.

● నాన్న నాతో చెప్పే చిన్న చిన్న మాటలే నాకు లోతైన అవగాహన కలిగిస్తాయి. నా కెరీర్ పరమైన, రోజువారీ విషయాల్లో ఆయన కలుగజేసుకోరు. కానీ ఎదుటి వ్యక్తి నొచ్చుకోకుండా ఎలా సాఫ్ట్‌గా మాట్లాడాలో, మనం చెప్పే మాట ఎదుట వ్యక్తికి సులువుగా అర్థమయ్యేలా ఎలా మాట్లాడాలో అప్పుడప్పుడు చెబుతుంటారు.

● మా నాన్నకు కుటుంబం తప్ప వేరే వ్యాపకం లేదు. ఆఫీసు, ఇల్లు, కుటుంబం... ఇదే ఆయన లోకం. చేసే పనిలో నిజాయితీ, నిబద్ధత, అంకితభావం ఎలా ఉండాలో నాన్నగారి నుండి నేర్చుకున్నాను. మనం చేసే పనికి నూటికి నూరు శాతం న్యాయం చెయ్యాలని నేర్చుకున్నాను. అలాగే లైఫ్‌లో జరిగే ప్రతీ విషయం గురించి అదే పనిగా ఆలోచించకుండా 'ప్రశాంతంగా ఉండటం' అనేది మా నాన్న నుంచి నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను.

● నా లైఫ్‌లో మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ అంటే... చాలా చిన్న వయసులోనే నాకు సంబంధించినవి నేనే ఎంచుకునే ఫ్రీడమ్. వీటివల్లే నేను సొసైటీలో తిరిగి, చాలామంది వ్యక్తులను కలిసి, అన్ని రకాల పరిస్థితులను దగ్గరగా చూసి, ఆలోచించి, అందుకు తగ్గట్టు ప్రవర్తించడం నేర్చుకున్నాను. సినిమా షూటింగ్, ఇతర పనులతో ఎంత బిజీగా ఉన్నా నాన్నతో కూర్చుని మాట్లాడతాను. అయితే ఒక వృత్తితో పోలిస్తే ఇప్పుడు వరుస సినిమాల వల్ల నిజంగానే నాన్నగారితో ఎక్కువ టైమ్ గడపడానికి కుదరడం లేదు. అదో చిన్న లోటులా అనిపిస్తుంటుంది.

● మా నాన్నగారికి ఇప్పుడు 64 ఏళ్లు. ఆయన ఉదయం 5 గంటలకు నిద్రలేచి, గంట వాకింగ్ చేస్తారు. తర్వాత ఆఫీసుకు వెళ్లడం. గత 30 ఏళ్లుగా ఇదే దినచర్య. నాకు క్రమశిక్షణ ఉంది కానీ... ఇలాంటి క్రమశిక్షణను అలవాటు చేసుకోవడానికి ట్రై చేస్తున్నాను.

● మా నాన్నగారి 60వ పుట్టినరోజు సందర్భంగా నా సంపాదనతో ఆయనకి ఒక మంచి కారు కొని, గిఫ్ట్‌గా ఇచ్చాను. అప్పుడు ఆయన చాలా సంతోషించారు. ఈ 'ఫాదర్స్ డే'కి మా నాన్నగారికి నేను ఇచ్చే గిఫ్ట్ అంటే 'సాక్షి'కి ఇచ్చిన ఈ ఇంటర్వ్యూనే. మా నాన్నగారు ఈ ఇంటర్వ్యూ చదివి, ఇచ్చే రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను.


● విష్ణు మంచు

శివయ్యా అని మనసారా పిలువు...

''**దే**వుడు లేడు... గీవుడు లేడు. అది ఒట్టి రాయి' అనే డైలాగ్‌తో ప్రారంభమైంది 'కన్నప్ప' సినిమా తెలుగు ట్రైలర్. మంచు విష్ణు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, కాజల్ అగర్వాల్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఎమ్. మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''ఆ తిన్నడు సామాన్యుడు కాదు... అతడ్ని దాటి వాయులింగాన్ని చేరడం అసాధ్యం', 'వాయులింగం మీద దుర్మార్గుల చూపు పడింది', 'ఈ వాయులింగం రహస్యాన్ని కాపాడటానికి నా ప్రాణాలను సైతం అర్పిస్తాను', 'ఈ గూడెంలో ఏ బిడ్డకు ఆపద రానివ్వను ఇది నా ఆన. తిన్నడి ఆన', 'ఇలాండివాడు మీకు గొప్ప భక్తుడు అవుతాడని మీకు నమ్మకం ఏంటి ప్రభు', 'నీతో పాటే నేను ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నాను... రుద్ర', 'ఎవరు నువ్వు... ఆ పెద్దల్లోందరి కంటే నేనే పెద్దోణ్ణి', 'నన్ను మించిన శివ భక్తుడా... ఈ సృష్టిలో లేడు', 'శివయ్యా అని మనసారా పిలువు..' అనే డైలాగ్స్ 'కన్నప్ప' ట్రైలర్‌లో ఉన్నాయి.